# నల్లచెడ్డీ

ఎండ బాగా కాస్తోంది. క్రిక్కిరిసి ఉన్న కంపార్టుమెంటులో ఫేనులు తిరుగుతున్నా ఉక్క ఎక్కువ అవుతున్నట్టు అనిపిస్తోంది. రైలు కిటికీల్లోంచి వడగాలి విసురుగా వీస్తోంది. అనుకోకుండా ప్రయాణం పెట్టుకోవడం వలన రిజర్వేషన్ దొరకలేదు. ఎక్కినప్పటి నుండి ఇబ్బందిగానే ఉంది. కాజీపేటలో నడుం ఆనించడానికి వీలు కలిగింది. ఒక సీటులో పావువంతు దొరికింది. సంతోషపడ్డాను. చంద్రపూర్ చేరే సరికి సాయంత్రం అవుతుంది.

సిరిపూర్ దాటిన తర్వాత అనుకుంటాను, మేం కూర్చున్న చోట ఫేను ఒకటి తిరగడం మానేసింది. దాంతో గాలి మరింత బిగుసుకుపోయింది. నా పక్కన కూర్చున్న బట్టతలాయన ఫంట్లాం వెనక జేబులోంచి పొడుగాటి దువ్వెన తీసి ఫేను రెక్కలను కదిలించడానికి ప్రయత్నించాడు. జుట్టు అంతగా లేని అతను అంత పొడుగాటి దువ్వెన ఎందుకు పెట్టుకున్నాడో నాకు అర్థం కాలేదు. మళ్లీ అతను దువ్వెనలు, చెవుల్లో గుబిలి తీసుకునే పిన్నులు, మొలతాడులు అమ్మే వాడిలా కనిపించలేదు. ఫేను రెక్కలు తిప్పడానికి అతను అయిదు నిమిషాల పాటు ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. విసుగు పుట్టిందనుకుంటాను. దిగుతూ ఎవరి తల మీదో పొరపాటున కాలు పెట్టేసరికి పోట్లాట మొదలయింది. ఆ తలకాయ తాలూకు మనిషి వారం కిందటి వరకు స్పాండిలయిటిస్‌తో బాధపడ్డాడని, ఇప్పుడిప్పుడే నెమ్మదవుతోందని వాళ్ల అరుపుల్లో నాకు అర్థం అయింది. ఒకరినొకరు తిట్టుకోవడం వరకు జరిగారు. తన్నుకుంటారేమోనని ఎదురు చూశాను. తన్నులాటలో నేను పాల్గొనంతసేపూ ఇష్టపడతాను. సందడిగా ఉంటుంది. డల్‌గా కూర్చోవడం కన్నా మాట్లాడుకోవడానికి టాపిక్ దొరుకుతుంది. ఇబ్బందిగా ఉన్న ప్రయాణం చేసినట్టు ఉండదు. తిట్టుకోవడం దగ్గరే ఆగిపోయారు. నాలుగు భాషలు తెలిసిన నాకు వాళ్లు ఏ భాషలో తిట్టుకున్నారో

అర్థం కాలేదు. బహుశా ఆ అరుపులకేమో ఫేను తిరగడం మొదలుపెట్టింది. తిరిగి గాలి రావడం మొదలయింది.

ఆ ముచ్చట పదినిమిషాలు కాకముందే చల్లారిపోయింది. ఫేను తిరగడం మానేసింది. ఇందాక అరుచుకున్న వాళ్లు పోట్లాడుకుంటే బావుంటుందనిపించింది. వాళ్ల అరుపులకు ఫేను మళ్ళీ తిరగవచ్చుని అనుకున్నాను. బయటకు అనలేదు. బట్టతల అతను జేబులోంచి దువ్వెన బయటకు తీశాడు. అయితే ఫేను రెక్కలు దువ్వెనతో కదిలించడానికి వెనకా ముందు ఆడుతున్నట్టు అనిపించింది. ఇందాకటి పోట్లాటకేమో అతనికున్న కొద్దిపాటి వెంట్రుకలు నిలబడి ఉన్నాయి. దువ్వెనతో ఆ జుట్టు దువ్వుకోడానికి భయపడుతున్నట్టు అనిపించింది. అతని ఎదురుగా కూర్చున్న వ్యక్తి అతనికి ఫేను చూపించి మళ్లీ తిప్పమని సంజ్ఞ చేశాడు. బట్టతల అతను తల ఆడించాడో లేదో అతని చేతుల్లోంచి చొరవగా దువ్వెన తీసుకుని ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా నిలబడే ప్రయత్నం చేస్తోంటే, ఎందుకయినా మంచిదని మాజీ స్పాండిలయిటీస్ వ్యక్తి లేచి నిలబడ్డాడు, జాగ్రత్త చర్యగా. అతను నిలబడి ఫేను రెక్కలు కదిపే లోపల వాటంతట అవే తిరగడం మొదలెట్టాయి. వాటి వేగానికి దువ్వెన ఇరుక్కుని ముక్కలయ్యేసరికి బట్టతలాయన ముఖం చిన్నబోయింది. చివరకు అంగుళమంత ముక్కమటుకు మిగిలింది. దాన్ని అతను అందుకుని చివరి చూపులా ప్రేమగా చూసి అయిష్టంగానే కిటికీలోంచి బయటకు విసిరాడు. బహుశా ఆ దువ్వెనను అతను తన జుట్టు ఒత్తుగా ఉన్నప్పటినుండి అట్టే పెట్టుకున్నట్టు ఉంది. ఎప్పుడూ శుభ్రం చేసినట్టులేదు. మొదట్లో ఏ రంగులో ఉండేదో?

అయిదు నిమిషాల తర్వాత ఏదో కాలుతున్న వాసన వేయడం మొదలెట్టింది. విరిగి ముక్కలయిపోయిన దువ్వెన గురించి ఆలోచించడం వలనేమో బట్టతల అతని బుర్ర వేడెక్కి ఆ వాసన వేస్తోందేమోనని అతని వంక చూశాను. అతను క్రికెట్ అంపైర్‌లా వేలెత్తి పయికి చూపించాడు. ఫేను మళ్లీ ఆగిపోయి ఉంది. ఫేనులోంచి పొగవస్తోంది. కనక్షన్ ఎక్కడో వదులయి లోపల నిప్పు అంటుకున్నట్టుంది. మంటలు బయటకు రావడం లేదు. పొగ కొంచెం కొంచెంగా దట్టమవుతోంది.

అప్పటికి గాని ప్రయాణీకుల్లో చలనం మొదలుకాలేదు. నిద్రపోతున్న వాళ్లు లేచారు. హడావిడి మొదలయింది. గాభరా పెంచుకోసాగారు. అంత వేగంలో మంట అందుకుంటే కంపార్టుమెంటు అంటుకోడానికి అట్టే సమయం పట్టదు. ఇటువంటి సంఘటనల గురించి వార్తాపత్రికల్లో లోగడ చదివినప్పుడు అయ్యోపాపం

అనిపించేది. ఇప్పుడు ఈ సంఘటన హఠాత్తుగా ఎదురయ్యేసరికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. కొందరు ఎవరి మీదో అరుస్తున్నట్టు మాట్లాడుతున్నారు. మరికొందరు ఏడవడం మొదలుపెట్టారు. ధైర్యం చేసి ఏదయినా చేయాలి. మంటలు మొదలుకాక ముందే ఎలాగో ఒకలాగా బండిని ఆపాలి అనుకుని దాదాపు ఎగిరినంత పనిచేసి అలారం గొలుసు అందుకుని శక్తికొద్దీ కిందకు లాగాను. బండి ఆగుతుందనే అనుకున్నాను.

నా ఊహ తప్పయింది. గొలుసు ఊడివచ్చింది. నాకు భయం మొదలయింది. ఏడుపులు రెట్టింపు అయ్యాయి. ఎవరో స్విచ్‌లు ఆఫ్‌చేశారు. ఫేన్లు ఆగిపోయాయి. ఒకతను పొగ వస్తున్న చోట నీళ్ళు కొట్టాడు. ఇంకోతను ఫేను పట్టుకుని లాగడానికి ప్రయత్నం చేశాడు. వేడెక్కి ఉండటాన వీలుకాలేదు. ఒక్కొక్కరు ఒక్కొక్క సలహా ఇస్తున్నారు. ఎవరూ ఎవరిమాటా వినిపించుకోవడం లేదు. కంపార్టుమెంటు హాహాకారాలతో నిండడం మొదలెట్టింది. తలుపు దగ్గర నిలబడినవాళ్ళు పక్క కంపార్లుమెంటు వాళ్ళతో అరుస్తూ మా పరిస్థితి చెబుతున్నారు. అయితే మాది జనతా బండి. ఒకరి మాట ఒకరు వింటారేమిటి? బండి వేగంగా నడుస్తోంది.

బండి ఆపడానికి నాకు ఒక మార్గం తట్టింది. తలుపు దగ్గర నిలబడి ఎర్రగుడ్డతో కొద్దిసేపు సంకేతాలు ఇస్తూ ఊపితే బండి డ్రయివరో, గార్డోచూసి బండి ఆపించే అవకాశం ఉంది. దానికి ఎర్రగుడ్డ తువ్వాలో, చొక్కానో, బనియనో, తలగుడ్డో, ఏదయినా కావాలి. ఎరుపురంగు గుడ్డ కోసం చుట్టూ చూశాను. ఎర్ర రవికలు తొడుక్కున్న ఇద్దరాడవాళ్ళు కంపార్టుమెంటులో.ఇంత అవుతున్నా తమకు సంబంధించిన విషయం కాదన్నట్టు కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు. వాళ్ళను అవితీసి ఇవ్వమని అడగడం ప్రమాదకరంగా ఉంటుంది. అడగడం కన్నా పెట్టెలో కాలిపోవడమే నయం.

నా చూపులు అటూ ఇటూ సారిస్తోంటే అరవతంబి దొరికాడు. లుంగీ మోకాళ్ళకు పయిగా ఎగ్గొట్టుకుని కిటికీకి ఆనుకుని కూర్చుని ఉన్నాడు. ఏ ఫేక్టరీలో పనిచేస్తున్నాడో ఏమో ఈ పొగలు రావడం సామాన్యమయిన విషయంలా పట్టీపట్టనట్టు ఉన్నాడు. అతని లుంగీ లోంచి మోకాళ్ల వరకు ఉన్న ఎర్రటి నిక్కరు కనిపించేసరికి నా ప్రాణం లేచివచ్చింది.

ఆలస్యం చేయలేదు. అతని దగ్గరకు వెళ్ళి ఏ మాత్రం సిగ్గుపడకుండా తెలుగులో అతనికి అరవంలో అర్థమయ్యేలా సంజ్ఞలు చేస్తూ నిక్కరుతీసి ఇవ్వమని అడిగాను. సందెట్లో సడేమియాలా అది తీసుకుని ఎక్కడ ఉడాయిస్తానని అనుకున్నాడో, ఏమో

నా ముఖంలోకి అనుమానంగా చూసి ఇవ్వనన్నట్లు తల అడ్డంగా ఆడించాడు. ఎందుకు అడుగుతున్నానో కారణం తెలుగులో గట్టిగానే వివరించాను. దాంతో తంబి కొద్దిగా మెత్తపడి తన పక్కనే కూర్చున్న మరో తంబిని అడిగాడు. మరో తంబి ఇవ్వమన్నట్లున్నాడు. ఎవరినయినా మనం పెన్ను అడిగినప్పుడు మూత తన దగ్గర ఉంచుకుని పెన్ను ఇచ్చినట్టు, నాడా తన దగ్గర ఉంచుకుని ఎర్ర చెడ్డీతీసి నాకు అందించాడు. కాందిశీకులకు దానం చేస్తున్నట్టు మరోవ్యక్తి తన మొలతాడు తీసి ఇచ్చాడు. దాని ఉపయోగం కూడా ఉంది.

చెడ్డీ నా చేతిలోంచి జారిపోకుండా ఆ తాడుతో నా చేతికి గట్టిగా ముడివేసి కట్టుకుని తలుపు దగ్గర నిలబడి ఎర్రజండా ఊపుతున్నట్టు అరుస్తూ చేయి ఆడించడం మొదలెట్టాను. కమ్మీ పట్టుకుని అలా చేయడం నాకు ఇబ్బందిగానే ఉంది. బండి ఆగుతుందనే ఆశ నాలోంచి పోలేదు. నేను పొరపాటున జారి పడిపోకుండా ఉండడానికి కొద్దిగా లావుగా ఉన్న వ్యక్తి నా నడుం గట్టిగా పట్టుకుని నా వెనకే నిలబడి ఉన్నాడు. ఆ వ్యక్తిజారి నా మీద ఎక్కడ పడతాడేమోనని భయంగానే ఉంది. వీటికి మించి తంబి చెడ్డి నన్ను ఇబ్బంది పెడుతోంది. ఎన్ని రోజులనుండి దాన్ని విడవకుండా తొడుక్కుంటున్నాడో, ఏ మాత్రం శుభ్రంగా లేదు. ఆ వాసనకు కళ్లు తిరిగి ఎక్కడ పడిపోతానో అనిపిస్తోంది. నన్ను పట్టుకున్న వ్యక్తికి అప్పుడే ఎలర్జీ మొదలయినట్టుంది. తుమ్మడం మొదలెట్టాడు. మరో నాలుగయిదు సార్లు ఘాటుగా తుమ్మితే నేను బండిలోంచి కింద పడిపోవడం ఖాయం. చేతులతో ముక్కు తడుచుకోలేక నా వీపుకు తన ముక్కు రాయడం మొదలెట్టాడు.

ఎలా అయితేనేం మా ప్రయత్నం సఫలం అయింది. అయిదు నిమిషాల తర్వాత బండి వేగం నెమ్మదిగా తగ్గి ఆగింది. డ్రయివరు, గార్డు, రైల్వే పోలీసులు వచ్చారు. డాక్టరును చూడగానే మందు తీసుకోకపోయినా, జబ్బు తగ్గినట్టు ఫేనులోంచి పొగ రావడం వాళ్ల రాకతో తగ్గింది. హడావిడి చేసినందుకు తప్పు మాదిలా చూశారు. కానిస్టేబులు దగ్గర కర్ర తీసుకుని డ్రయివరు ఫేనుమీద కొట్టేసరికి ఫేను ఊడి వచ్చింది. పొగ రావడం ఆగిపోయింది. బక్క పోలీసును పెట్టెలో ఉంచి, "ఏం కాదు లెండి. భయపడనవసరం లేదు" అని అందరికీ అర్థమయ్యేలా స్టేషన్లలో చెప్పేవిధంగా మూడు భాషల్లో ఎనౌన్స్‌చేసి దిగిపోయారు. ఎర్ర రవికలు తొడుక్కున్న

వాళ్లకివేం పట్టినట్టు లేదు. మాట్లాడుకుంటూనే ఉన్నారు. పావుగంట తర్వాత బండి కదిలింది.

ఎర్ర చెడ్డీతో అవసరం తీరిపోయింది. తాడు విప్పి బయటకు విసిరాను. గాలి విసురుకు అది వెళ్ళి పక్క పెట్టె లోంచి ముఖం బయటపెట్టి మా వయిపు చూస్తోన్న వ్యక్తి ముఖం మీద పడి, కొద్దిసేపు అలానే అతుక్కుపోయి ఉంది. ఆ వాసనకు ఆ వ్యక్తి స్పృహకోల్పోయి ఉండాలి. అతని ముఖం మళ్లీ కనబడలేదు.

తిరిగి వచ్చి నా పావు సీట్లో అలా కూర్చున్నానో లేదో తంబి తన చెడ్డీ గురించి అడగడం మొదలుపెట్టాడు.

"నా నల్లచెడ్డీ ఏది?" అరవంలో అడిగాడు.

"అది నల్ల చెడ్డీ కాదు. ఎర్ర చెడ్డీ" అన్నాను తెలుగులో.

కొద్దిసేపు వాదించుకున్న తర్వాత కాని నల్ల చెడ్డీ అంటే మంచిదన్న సంగతి నాకు తెలిసి రాలేదు. "పోయింది" అన్నాను. నన్ను చాలా కోపంగా చూశాడు. ఆ కోపంలో లుంగీ కూడా విప్పేస్తాడేమోనని భయపడ్డాను. నేను భయపడినంత జరగలేదు కాని నేను చంద్రపూర్ చేరుకునే వరకు గొణుగుతూనే ఉన్నాడు.

❖ **రచన, ఆదివారం వార్త, 28 అక్టోబర్ 2007**